# కన్నీటి మడుగు



ధూళిపాళ అన్నపూర్ణ

కథ

"టీచర్! మనం పాతిన గులాబీ మొక్క పువ్వు పూసింది. కానీ, టీచర్! ఏదో చీడబట్టినట్టుంది. ఒక్కసారి రండి" అంటూ నా దగ్గరికి వచ్చింది హరిత. పేపర్లు దిద్దుతున్న నేను జాగ్రత్తగా అన్నీ సర్ది, వెయిట్ పెట్టి, లేచి ఆ పిల్ల వెనకే తోటలోకి వెళ్ళాను. ఈ మధ్య మా స్కూలు బిల్డింగ్ రీమోడల్ చేశారు. లైన్స్‌క్లబ్ వాళ్ళ సాయంతో చాలారకాల మొక్కలు నర్సరీ నుండి తెప్పించి చక్కగా కనులకు విందులా నాటారు పిల్లలు.

సహజంగా నాకు మొక్కలు పెంచడంలో ఉండే ఇంట్రస్టు కొద్దీ ఆ డ్యూటీ నేను తీసుకున్నాను. స్కూలు టైము అయిపోయాక కొంచెం సేపు ఆ మొక్కలమధ్యలో పువ్వుల్లాంటి ఈ పిల్లలతో గడపడం నాకు చాలా బాగుంటుంది. ఈ కారణంగా మా స్కూల్లో 'గ్రీన్'కి 'క్లీన్' చేసే 'క్లీన్ అండ్ గ్రీన్' ప్రోగ్రామ్‌లాకాక మూడు మందార పువ్వులు- ఆరు గులాబీగుత్తులుగా పరిమళిస్తోంది అని మా తెలుగు మాష్టారు అంటూ ఉంటారు.

"నీకేం తల్లీ! ఏ బాదరబందీ లేదు. మొక్కలనైనా పెంచుతావు. బళ్లో పిల్లల్ని అయినా పెంచుతావు!" అంటూ, నన్ను నా ఒంటరితనాన్ని గుర్తు చేస్తూ వేళాకోళం చేస్తూ ఉంటారు మా కొలీగ్స్.

'చూడండి టీచర్! ఈ పువ్వు ఎంత బాగుందో! రేపటికి ఈ పురుగు తినేస్తుందేమో! మొదటి పువ్వుని దేశమాత పటానికి పెడదామనుకున్నాం కదా!' అని భయపడుతూ దిగులుగా అంటోంది హరిత.

'ఫరవాలేదు హరితా! మందు ఇచ్చారు కదా! వాటిని స్ప్రేచేద్దాం సాయంత్రం' అని హరితను ఓదార్చాను.

ఇంతలో రాములు వచ్చి "డి.ఇ.ఓ. ఆఫీసు నుండి ఆఫీసరుగారు వచ్చారమ్మా! 'ఎయిడ్స్' మీద అవేర్‌నెస్ క్లాసులు కండక్ట్ చెయ్యాలిట ఈ వారమంతా! సజషన్స్ ఇవ్వడం కోసం టీచర్స్ అందర్నీ పిలుచుకు రమ్మన్నారు హెడ్మాష్టారు" అన్నాడు.

'సరే! పద' అని బయల్దేరి వస్తుంటే, సింహాచలం మనవరాలు వెనకనుండి పరిగెత్తుకుని వచ్చి 'హేపీ బర్త్‌డే టీచర్' అంటూ ఒక యాసతో ఇంగ్లీషులో పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పి బంతిపువ్వు నా చేతిలో పెట్టింది. ఒకసారి నా పుట్టిన రోజునాడు ఇలా చెప్తే దానికి అందరితోపాటు చాక్లెట్లు ఇచ్చాను. అప్పటి నుండి ఏ పిచ్చిపువ్వు వున్నా నాకిచ్చి ఇలా చెప్తుంది. 'థేంక్యూ' అంటూ నా బాగులోంచి తీసి దానిచేతిలో చాక్లెట్ పెట్టాను. దాని ముఖంకేసి చూడగానే చీడ బట్టిన ఆ గులాబీ నా కళ్ళల్లో మెదిలింది. ఈమధ్య తరచు ఈ పిల్లకి ఒంట్లో బాగుండడంలేదని డాక్టరు గారికి చూపించమని గోల పెడుతోంది సింహాచలం.

"వారంరోజులు ఎవ్వరూ లీవ్ పెట్టకూడదు. ప్రతీ క్లాసులోనూ పిల్లలందరికీ ఎయిడ్స్ పట్ల స్పష్టమైన అవగాహన కలగజెయ్యాలి. 'కండోమ్స్' వాడకం వాళ్ళకు ఇప్పటి నుండీ నేర్పాలి. విద్యార్థి దశ నుండి వాళ్ళకు వీటిపట్ల శ్రద్ధ ఏర్పడకపోతే రేపు ఈ వ్యాధిని అరికట్టడం ఆ భగవంతుడి వల్ల కూడా కాదు" అంటూ ఆఫీసరు గారు చిలకపలుకులు వల్లిస్తూ, చేతిలో ఉన్న ఒక వారపత్రికతో బల్ల గుద్ది మరీ చెప్పారు. మీటింగులో కూర్చుని ఉన్న స్టాఫ్ అందరిలో రెండువంతులమంది ఆడవాళ్ళే! వంచిన బుర్ర ఎత్తితే ఆఫీసరుగారి ముఖంతోపాటు మిగతా మగవాళ్ళ ముఖం ఎక్కడ చూడాల్సి వస్తుందో అని ముఖం భూమిలోకి దించుకుని కూర్చున్నారు. ఇలాంటి విషయాలు పబ్లిక్‌లో మాట్లాడే సంస్కృతికి ఇంకా వీళ్ళు దూరంగా ఉన్నారు. మగవాళ్ళు ముసిముసినవ్వులు నవ్వుకుంటూ కండోమ్స్ వాడకాన్ని ఏ క్లాసునుండి నేర్పమంటారో అడిగి మరీ తెలుసుకుంటున్నారు. ఇంక చివరకు-

"కాబట్టి మీరంతా సక్రమంగా ప్రచారంచేసి ఈ 'కండోమ్స్'ని గుమ్మాలకు ప్రతీ క్లాసుకీ కట్టి, వీటి వాడకాన్ని పిల్లలకు తెలియజెయ్యండి" అంటూ లేచి నిలబడి, ఆయన కూడా తెచ్చుకున్న వారపత్రికను జాగ్రత్తగా చేతిలోకి తీసికొని, హెడ్మాష్టరుగారి రూంలోకి వెళ్ళిపోయారు.

మా అందరికీ సింహాచలం టీ, బిస్కట్లు తీసికొని వచ్చింది. నేను టీ తీసుకొంటూ ఏదో అడగబోయి, ఆవిడ ముఖంలోకి దిగులుగా చూసి ఊరుకున్నాను. సింహాచలం కొడుకుపోయి ఆరు నెలలు గడిచింది. ఇంకా నిన్ననో, మొన్ననో జరిగినంతగా ఏడుస్తూ ఉంటుంది. ఎంత ఆత్మీయులు దూరమయినా, మరునాటికే ఏమీ జరగనట్టుగా నలుగురిలోకి రాగలిగే స్థితప్రజ్ఞత, పాపం సింహాచలానికి అలవడలేదు. పనికి రాకపోతే పొట్ట గడవని పరిస్థితి. వచ్చి తన పని తాను చేసి ఏమూలో ఏడుస్తూ కూర్చుంటుంది.

'అమ్మా! ఇవాళ్టికి సమంగా ఆరునెలలు నిండి ఏడోనెల చొరబడిందమ్మా! నా కొడుకుని చంపి ఆ దొంగముండ పారిపోయింది. దానమ్మ కడుపు మాడ!' అని తిట్టుకుంటూ వెళ్ళిపోయింది. మా కందరికీ ఆవిడ ధోరణి ఈ ఆరునెలలుగా అలవాటయిపోయింది. ఆవిడ కొడుకు ఈ స్కూల్లోనే టెన్త్‌క్లాసు వరకు చదువుకున్నాడు. వాడి ముఖం చాలా కళగా ఉండేది. చురుగ్గా ఉండేవాడు. తెలివైనవాడు. అన్నిటికంటె ప్రత్యేకాకర్షణ వాడిలో వాడు చేసే డాన్సు. ఏ హీరో వేసిన స్టెప్స్ అయినా, చాలా అవలీలగా విలాసంతో వేసి చూపించేవాడు. స్కూల్లో అందరూ ఏమాత్రం ఖాళీ దొరికినా వాడిని పిలిచి డాన్సు చేయించుకునే వారు. మా సైన్స్ మాష్టారయితే ఎప్పుడూ 'ఒరేయ్ నువ్వు చిరుత్యాగరాజులా', 'చిరు'జీవి వై పోతావు. సినిమాల్లోకి పోరా' అని మురిసిపోతూ ఉండేవారు. ఆయనకి చిరంజీవి అంటే 'చిన్న'పిల్లాడికున్నంత ఇష్టం. వాడి పుస్తకాలకి ఎప్పుడూ పెద్దపెద్ద హీరోల బొమ్మలే అట్టలుగా వేసుకునేవాడు. ఆ బొమ్మలకేసి చూస్తూ ఆ సినీ మాయాలోకంలోకి వెళ్ళిపోతూ ఉండేవాడు.

వాడు పదోక్లాసులోకి వచ్చేటప్పటికి వాడి పుస్తకాలమీద అట్టలు అమ్మాయి బొమ్మలుగా మారా

యి. వాడు ఒక్కడూ చేసే డాన్సు,క్రమంగా చిన్ని చిన్ని బట్టలున్న పెద్దపెద్ద హీరోయిన్‌లతో చేస్తున్నట్టు ఫీలవుతూ ఉండేవాడు. వాడు హేలగా చేసే ఆ డేన్స్‌కు సంతోషంగా అనిపించినా, వాడిలో కలిగినది వయో సహజమైనదైనా ఈ మార్పు నాకు కొంచెం వికారంగా అనిపించేది.

నేను దెబ్బలాడి వాడిచేత అమ్మాయి బొమ్మల అట్టలు మానిపిస్తూ ఉండేదాన్ని.వాళ్ళమ్మని బతిమాలి డబ్బులు తీసికెళ్ళి ఒక సపరివార సరస వారపత్రిక కొని తెచ్చేవాడు. అందులో ఉన్న నటీనటుల గాసిప్స్ చదివి అందరికీ చెబుతూ ఉండేవాడు. వాడు చెప్పే ముంబాయి కబుర్లకీ, మద్రాసు మసాలాకీ క్లాసులో చాలా క్రేజ్ ఉండేది. పాపం! వాళ్ళమ్మ కూడా వాడు ఆ పుస్తకం చదవగలగడం, కార్లలోనూ, విమానాల్లోనూ తిరిగే ఆ కోటీశ్వరుల కబుర్లు వాళ్ళ ఇంట్లో జరిగినంత ప్రత్యక్షంగా చెప్పడం చూసి తెగ సంబరపడిపోయేది.

'ఆ పుస్తకం కొనడానికి వాడికి డబ్బులివ్వకు సింహాచలం, వాడు ఆ పిచ్చిలో పడి చదువు నిర్లక్ష్యం చేస్తున్నాడని అంటూండేదాన్ని. ఆ పుస్తకం ఈ వయసు పిల్లల్ని కంగారు పెడుతుంది. పిల్లాణ్ని జాగ్రత్తగా చూసుకో' అని అంటే 'మగపిల్లవాడే కదమ్మా' అంటూ ఉండేది. మా మాటలతో ఈ సినిమా నటుల కబుర్లతో వాడూ సినిమా నటుడైపోతాడని ఒక వెర్రి ఆశ, ఆనందం ఆవిడకి.

వాడు రోజూ నాకు పాలు తెచ్చిపెడుతూ ఉండేవాడు. వాళ్ళమ్మ ఒక గేదెని మేపి పాలు మా అందరికీ పోస్తూ ఉండేది. ఉదయం ఎప్పుడూ లేటే! ఏరా ఆలస్యమయిందేం? అంటే 'రాత్రి మిడ్‌నైట్ మసాలా' చూశాను టీచర్, అంత లావున్న అనూరాధని చిరంజీవి గిరగిరా తిప్పడం చూస్తోంటే ఆశ్చర్యమేసేసింది టీచర్.రాత్రంతా నిద్రపట్టలేదు' అని ఏమీ సంకోచం లేకుండా నాతో చెప్పేవాడు. వాడికి ఆ లేతవయసుకు- వాడు పెరిగినవాతావరణానికి నా దగ్గర ఈ విషయం మాట్లాడడం సభ్యత కాదన్నది కూడా తెలియదు.


'ఎందుకురా? అర్థరాత్రి వరకు టి.వి చూడడం. పరీక్షలు వస్తున్నాయి చదువుకోవచ్చుకదా' అంటే-

'చదువుకుని ఏం పైకి రాగలం టీచర్. సినిమాల్లోకిపోతే కార్లు, మేడలు, అమ్మాయిలతో డేన్సులు' అని వాడంటూంటే నాకు నోటమాట రాలేదు.వాడిని మేమే చెడగొట్టామా? వాడి కళని మెచ్చుకుని వాడికి సినిమా ఆశ కల్పించి వాడి కాళ్ళు నేల మీద లేకుండా చేశామా అని అనిపించేది.

ఒకసారి వాడి క్లాస్‌మేట్ ప్రభ- నిజంగా ప్రభే నా దగ్గరకు ఏడుస్తూ వచ్చింది.

'టీచర్! కొండబాబు నాకు ఉత్తరం రాసి ఈ పత్రికలో పెట్టి ఇచ్చాడు. ఈ బొమ్మ చూడండి టీచర్ ఎంత అసహ్యంగా ఉందో' అంటూ సరస వారపత్రికలోని ఆ ఉత్తరం ఉన్న పేజీ చూపించింది. ముందు ఆ అమ్మాయిని ఊరుకోబెట్టి పంపించి ఆ పత్రిక తీసి చూద్దునుకదా, అది సరస 'శృంగార' కథ. రెండు జంతువుల శృంగారాన్ని స'రస'గాథగా ప్రచురించారు. అదే! ఇద్దరు జంతుప్రవృత్తికల మానవుల 'శృంగార'గాథ. ఆ పిల్ల అది చూడడంతోటే హడలిపోయింది. ఒక వేళ నిజంగానే వాడు 'ప్రేమలేఖ' రాసి ఉంటే, ఈ లేత వయసు పిల్ల భవిష్యత్తు కూడా పదో క్లాసుతోనే ఆఖరయి ఉండేదేమో!

వాడిని పిలిచి నానాతిట్లు తిట్టాను. ఆ ఆవేశంలో 'మీడియా' మీద ఉన్న కోపమంతా వాడిమీద చూపించాను. అమ్మాయిల ప్రేమ ఎలా గెలవాలో, దానికి వాడు అలవరుచుకోవలసిన సున్నితం, వాడు సాధించవలసిన



లక్ష్యం ఏమిటో వాడికి ఒక గంట క్లాసు తీసుకున్నాను. దానితో వాడు నాకు పాలు తేవడం కూడా మానేశాడు.

సింహాచలాన్ని పిలిచి 'ఆ టి.వి అమ్మేసేయి లేకపోతే ఆ కేబుల్ కనెక్షనైనా తీసెయ్యి. అంతే కాకుండా వాడికి ఆ పుస్తకాలు కొనడానికి డబ్బులు ఇవ్వకు' అని చెప్పాను.

ఆవిడ- 'అమ్మా మొగోడు. నేను ఆపితే ఆగుతాడా? వయసు వచ్చేసినాది ఆడికి' అంటూ వాపోయింది. ఆవిడ అజ్ఞానానికి- మూర్ఖత్వానికి ఏంచెయ్యాలో అర్థం కాలేదు.

మొత్తానికి వాడు టెంత్‌క్లాసు తప్పాడు. వాడి నాట్య ప్రతిభతో సినిమాల్లోకి వెళ్ళలేకపోయేడు కానీ, అతికష్టం మీద ఒక రికార్డింగ్ డాన్సు ట్రూపులో చోటు సంపాదించాడు. ఎక్కడ నవరాత్రులు జరిగినా అక్కడ ఒకరోజు వీళ్ళ ప్రోగ్రాం ఉండేది. వీడికి డబ్బులు బాగానే దొరికేవి. కొన్ని డబ్బులు 'మామూళ్ళ'కి పోయినా, వీడి ఖర్చుకు లోటుండేది కాదు. దాంతో వాడు సంతృప్తిపడి పోయేవాడు. 'ఏరా సినిమాలు, కార్లు, బంగళాలు ఏమయ్యాయిరా?' అని ఎవరైనా అంటే 'మొన్ననే చూశారు సారూ ఆయన.వెళ్ళగానే కబురు చేస్తానన్నారు' అంటూ ఎవరో ఒక పెద్ద డైరెక్టరు పేరు చెబుతూ ఉండేవాడు.ఇలా వృథాగా రెండు సంవత్సరాలు గడిచిపోయాయి.

ఒకరోజు సింహాచలం పరిగెట్టుకుంటూ వచ్చింది. "రాత్రంతా ఇంటికి రాలేదు పిల్లాడు. 'ఈరోజు సెలవు కావాలంటూ' చాలా కంగారుపడింది. అందరూ 'ఏ మద్రాసైనా వెళ్ళిపోయాడేమో! కంగారుపడకు. పడవలాంటి కారులో దిగి వస్తాడు ఒకరోజు' అని ధైర్యం చెప్పారు.కానీ పాపం! సింహాచలం మాత్రం సరిపెట్టుకోలేకపోయింది. వాడికోసం వెతికి, వెతికి సాయంత్రానికి ఒక వైను షాపు పక్కన పట్టుకుని తీసుకువచ్చింది.

అందరూ ఇళ్లకు వెళ్ళిపోయే హడావిడిలో ఉన్నారు. ఆటో స్కూలు గుమ్మం ముందు ఆగేటప్పటికి అందరూ బయటికి వచ్చేశారు. హెడ్మాస్టరు కూడా ఎవరో వచ్చారనుకుని రూమ్‌లోంచి బయటకు వచ్చి నిలబడ్డారు.

ఎర్రగా ఉన్న కళ్లతో, దుమ్ము కొట్టుకుపోయిన బట్టలతో తూలుకుంటూ కొండబాబు దిగడంతోటే అంతా ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు. పిల్లలంతా వాడి వాలకం చూసి భయంతో వెనక్కి తగ్గి వాళ్ళలోవాళ్ళు గుసగుసలాడుకోవడం మొదలుపెట్టారు.

"ఎక్కడికి పోయావురా? మీ అమ్మ ప్రాణం కడగంటిపోయింది పాపం!" అంటూ హెడ్మాష్టరు దగ్గరకు వెళ్ళబోయారు.

"రాత్రి తెల్లార్లూ షాపు తెరిచిఉంచారు సారూ! డిస్కొంటు కూడా ఇచ్చారు. ఒకటి కొంటే ఇంకోటి ఫ్రీ! అందుకని అక్కడే ఉండిపోయాను. ప్రభ, ఆరోజు నా దగ్గరకు రానంది సారూ! అంతకంటె మంచి గుంట నాకు దొరికింది" అని తూలిపోయాడు. సంగతి గ్రహించి హెడ్మాష్టరు వెనక్కితగ్గారు. రాములుని పంపించి ఇంటికి తీసుకుపొమ్మన్నారు. వాడు మాట్లాడిన మాటలకి వాళ్ళమ్మ లెంపలేసుకుంటూ వాడిని లాక్కుపోయింది .ఆ లాగడంలో వాడితోపుకి సింహాచలం దూరంగా పడింది. వాడి మత్తు ఇంకా దిగనేలేదు. జేబులో ఇంకో సీసా కూడా ఉంది.

ఈ మొత్తం దృశ్యాన్ని చూస్తూ అవాక్కయి నిలబడిపోయాను. ఎంతో దుఃఖం వచ్చింది. కళకళలాడిపోతూ ఉన్న ఒకనాటి వాడి ముఖం-అతి చురుకుగా ఎంతో విలాసంతో కదిలే వాడి నాట్య విన్యాసం నా కళ్ళల్లో మెదిలాయి. దీనితోపాటు ఒకప్పటి వాళ్ళ అమ్మమాట కూడా నాకు గుర్తుకు వచ్చింది.

'ఎలాగో అమ్మా! పది పాసుచేస్తే, రాములు రిటైరయ్యాక అయ్యగారికాళ్ళు పట్టుకుని ఆ పోస్టులో వేయించుకుంటాను తల్లీ' అనేది మొదట్లో. ఎగబాకిపోవాలన్న తపన లేని చిన్ని ఆశ. అది కూడా భగ్నం అయిపోతున్నట్లుగా అనిపించింది నాకు. మనిషి జీవితం మీద నుండి రాక్షస

పాదాలతో నడుస్తున్న ఈ విధానాన్ని నేనెలా తప్పుపట్టకుండా ఉండను! తరువాత ఎన్నోసార్లు సింహాచలం పిల్లాడి ఆరోగ్యం ఏమీ బాగుండడంలేదని వాపోయింది. వాడికి తాగడం మానిపించు. ఆరోగ్యం బాగుపడుతుంది. నేనైతే చాలా సులువుగానే చెప్పేదాన్ని. కానీ అడుగుకి ఒక షాపుతో వాడిని మర్యాదపూర్వకంగా ఆహ్వానిస్తోంటే ఎవరితరం వాడికా అలవాటు మాన్పించడం?

ఈ పరిస్థితి అంతా ఇలా ఉండగానే, సింహాచలం 70వేలు కట్నం తీసుకుని వాళ్ళ అన్న కూతుర్నిచ్చి వాడికి పెళ్ళి చేసింది. మమ్మల్నందర్ని రమ్మని, దగ్గరుండి మరీ తీసికెళ్ళింది పెళ్ళికి. వాడి పెళ్ళిలో కూడా వాడు డేన్సు చేశాడు. ఏదిఏమైనా వాడు లయబద్ధంగా, ఒంట్లో ఎక్కడా ఎముకలే లేనట్టు కొండపల్లి బొమ్మలా కదుల్తుంటే, నాకు ఎక్కడలేని ఉత్సాహమూ, సంతోషమూ వచ్చింది. వీడికి కాలం కలసిరాలేదు అని అనిపించింది.

వాడిభార్య సీత చాలా ఒబ్బిడైన పిల్ల. వాళ్ళ అత్త రాకపోతే స్కూలుకి ఆ డ్యూటీ చేయడానికి వచ్చేది. అది ఎనిమిదో క్లాసు వరకు చదువుకుందట. ఆ క్లాసులో అదే ఫస్టట. ఇంతింత కళ్ళు చేసుకుని క్లాసులో పిల్లలకేసి చూస్తూ ఉండేది. అది గమనించి 'చదువుకోకూడదా సీతా!' అని నేనంటే, ఎంతో ఉత్సాహపడిపోయింది.

మా ఇంటికి సాయంత్రం వచ్చి ఇంగ్లీషు,

> **ఏం చెప్పనమ్మా! బావ మొన్న గవర్నమెంటు ఆస్పిటల్‌కి ఎళ్ళాడమ్మా! మరీ జ్వరంగానూ, నీరసంగానూ ఉన్నాడని, వద్దంటున్నా తన వెనకాలే వెళ్ళానమ్మా! చాలా పరీచ్చలు చేసి వాడికేదో జబ్బుయిందనీ, వాడివల్ల నాక్కూడా వస్తాదనీ, దూరంగా ఉండమనీ చెప్పారమ్మా!**

హిందీ రెండూ నేర్చుకునేది. ఎంత పని ఉన్నా చెప్పినది మరుసటి రోజుకే నేర్చుకుని వచ్చేది శ్రద్ధగా. చిన్నచిన్న పనులు సాయం చేస్తూ ఉండేది నాకు. వద్దన్నా వినిపించుకునేది కాదు. 'అమ్మా! ఇంతకంటే నేను మీకు ఏం చెయ్యగలను?' అనేది. వాళ్ళ అత్తమాత్రం "ఎందుకమ్మా! దానికి ఇంకా చదువు? గంజి కాచుకు తాగడానికి ఇదేం పనికొత్తదమ్మా!" అని స్కూల్లో నాతో వాదించేది.

ఒకరోజు తలమీద గాయంతో వచ్చింది సాయంత్రం. అప్పుడప్పుడు ఎర్రటి కళ్ళతో, అక్కడక్కడ దెబ్బలతో దాన్ని చూడడం నాకు అలవాటే. ఉండబట్టలేక ఏమయిందని ఎప్పుడు అడిగినా, ఏమీ చెప్పేది కాదు. ఈరోజు ఇంకా రక్తమోడుతున్నట్టు ఉన్న ఆ దెబ్బ చూసి గట్టిగా అడిగేటప్పటికి "పడిపోయానమ్మా! కాలు తిరగబడింది" అని చెప్పింది. నాకు నమ్మకంగా అనిపించలేదు. మా ఇంటి ఓనరు డాక్టరు. ఆయన దగ్గరకు తీసికెళ్ళి ఒక టిటి ఇంజక్షను చేయించాను. నొప్పి తగ్గడానికి ఆయన ఏవో మాత్రలు ఇచ్చారు.



మర్నాడు స్కూల్లో సింహాచలాన్ని అడిగా. ఎలా పడిపోయిందని. "పడిపోవడమే మిటమ్మా! మొగుడూపెళ్ళాలిద్దరూ రాత్రంతా తగూపడ్డారు. రికార్డింగ్ డేన్సు ట్రూపులో పిల్లింటికి వెళతా ఉంటాడు ఈడు. అక్కడికి వెళ్ళద్దంటదిది. ఆడు 'నా ఇష్టం, నేను మొగోణ్ని. నువ్వెవరే చెప్పడానికి' అని కలియబడ్డాడు.

అయినా దీనికంత పంత మెందుకమ్మా! మొగోడన్నాక ఎంతమంది ఆడోళ్ళున్నా ఉంటారు. ఎంతమంది ఆడగత్తెలుంటే అంత మగతనమున్నోడు అని మా నాయన చెబుతూ ఉండేవాడు. నోరుమూసుకోయే, అంటే ఇది ఇని సావదు' అని చెప్పుకుని వచ్చింది.

"అయినా ఇశాలమ్మా! దీనికి నేనేం తక్కవ సేశాను? జీతం వచ్చినాక పతీ నెలా ఒక కోక కొనిపడేత్తాను. రకరకాల తలపిన్నులు కొంటాను. నా ఎంబటే సినేమాకి తీసికెళ్తాను. ఆడి దగ్గర నోరుమెదపకుండా ఉండొచ్చుకదా! అయినా ఆడు ఆ డేనుసు మొదలుపెట్టినప్పటి నుండి ఆ ఆడముండలందరితోను స్నేహితాలున్నాయి. ఇయేల ఇది కాదంటే కుదురుద్దా?" అని మొదలుపెట్టింది.

నేను తెల్లబోయేను.

"ఆ పిల్ల బాధపడుతోంది కదా సింహాచలం! నువ్వు వాడికి చెప్పి చూడు" అన్నాను.

"ఏం చెప్పనమ్మా! వాడికసలే ఒళ్లు బాగుండట్లేదు. వాడి ప్రాణానికి కూసింత సుకం కోసం ఎక్కడికో ఎల్తంటే ఎలా వద్దని చెప్పను" అంది.

సీత మాత్రం మిన్ను విరిగి మీదపడ్డా చదువుకోవాలన్న పట్టు విడవట్లేదు. బాగా చదువుకుంటోంది. ఇదివరుకటి కంటె కూడా ఎక్కువగా వచ్చి నా దగ్గరే కూర్చుంటోంది.

ఒకనాడు పొద్దుటే వచ్చి భయం భయంగా గుమ్మం దగ్గర నిలబడి ఉంది. ఆ వేళప్పుడు అది సాధారణంగా రాదు. దానిముఖం చూస్తే సింహాచలానికైనా, కొండబాబుకైనా ఏమైనా అయిందా అని భయపడ్డాను. కానీ అది దాని ఒంట్లో అనారోగ్యం గురించి చెప్పింది. మా డాక్టరుగారు హాస్పటల్‌కు వెళ్ళిపోకుండా తీసికెళ్ళాను. ఆయన సీత చెప్పిందంతా విని, ఒక స్కిన్ స్పెషలిస్టు పేరు చెప్పి ఆయన దగ్గరకు తీసికెళ్ళమన్నారు.

పొద్దుట టైము అయిపోయింది. సాయంత్రం వెడదామని దానికి చెప్పి నేను తొందర తొందరగా స్కూలుకెళ్ళిపోయాను. డాక్టరు గారు సాయంత్రం దానిని చూసి మందులు రాసి ఇచ్చి జాగ్రత్తగా ఉండమని దానిని హెచ్చరించారు. మందులకి దాని దగ్గర సరిపడా డబ్బులు లేవు. నేను మందులు తీసుకుని దాని చేతిలో పెట్టేటప్పటికి కళ్ళనీళ్ళు పెట్టేసుకుంది.

'నువ్వేమీ బెంగపడక్కర్లేదు సీతా! నేను మీ అత్త జీతం రాగానే ఆవిడ దగ్గర తీసుకుంటాలే' అన్నాను.

వెంటనే కంగారుపడిపోయి, "వద్దమ్మా! ఎంత చెడ్డా కొడుకు కదమ్మా! వాడి దగ్గర రోగం నాకంటుకుందని తెలిస్తే అత్త బాధపడుద్ది. ఆడి కోసం బెంగపడతది. నేనే నెమ్మదిగా మీకు తెచ్చి ఇస్తాను" అంది.

నిజానికి సింహాచలానిక్కూడా ఒక్క కొడుకుకు కావలసినట్టు ఉండదన్న విషయం మినహాయిస్తే సీతంటే చాలా ప్రేమే! మేనకోడలేమో మరీ ఇష్టం.

ఇంకా ఈ మందులు పూర్తి అయ్యాయో లేదో నాకు సమంగా తెలియదు కానీ, పదిహేడేళ్ళ సీత నెల తప్పిందని సింహాచలం సంతోషంగా వచ్చి చెప్పింది. మరికొన్నినాళ్ళకు ఒక పిల్లను కూడా కంది. అత్త కోడల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంది. పురుటికి పుట్టింటికి పంపేవరకు.

కొండబాబు పరిస్థితిలో మాత్రం ఏమీ మార్పు లేదు. తరుచుగా ఏదో ఒక తేడాతో మంచమెక్కడమే! వాడి అందమంతా క్రమంగా కల్లుపాకల, వైన్‌షాపుల పాలయిపోయింది. సినిమా హీరోలా ఉండేవాడు కాస్తా పీనుగులా అయిపోయాడు. తిన్నదేమీ అరగడం లేదనీ జ్వరం వస్తోందనీ, కాళ్ళనెప్పులతో కొంచెం దూరం కూడా నడవలేకపోతున్నాడనీ సింహాచలం చాలా బెంగబెట్టుకుంది. మందులషాపులో కొని ఏవో మాత్రలు మింగిస్తూ ఉండేది.

'ఎవరికైనా డాక్టరుకు చూపించు సింహాచలం'

అని మా హెడ్మాష్టరుగారు అస్తమానూ అంటూ ఉండేవారు.

ఇలా ఉండగానే సింహాచలం చంటిపిల్లకి మూడునెలలు నిండకుండా కోడల్నీ, మనవరాల్నీ తీసుకువచ్చింది. వచ్చిన దగ్గరనుండీ సీత మళ్ళీ చదువుకునేందుకు రావడం మొదలుపెట్టింది. చంటిపిల్లను చంకన పెట్టుకుని వచ్చేసేది. ఆ లేతగుడ్డును అలా ఎత్తేసుకుంటోంటే నాకు చాలా భయంగానూ,ఆశ్చర్యంగానూ ఉండేది. ఆ పిల్లకి కొండబాబు ముఖమూ, సీత రంగూ వచ్చేయి. మా ముందుగదిలో ఆ పిల్లని పడుకోపెడితే ఇల్లు ఎంతోమంది ఉన్నట్టు ఉండేది. నేను ఆ పిల్లని ఆడిస్తూ ఉంటే సీత చక్కగా చదువుకునేది.

"అమ్మా! బావని ఎవరైనా డాక్టరుకు చూపించరా? అసలు బాగాలేదు" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

అలాగేలేవే! వాడిచేత తన్నులుతింటూ కూడా వాడిమీద ప్రేమే నీకు అని కసురుకున్నాను.

"లేదమ్మా! వాడి వాలకం చూస్తుంటే ఏదో పెద్ద రోగం పట్టుకున్నాడులా ఉన్నాడమ్మా! భయమేస్తుంది.కూతంత బయటికి వెడితే చానమ్మా!రొంప దగ్గు జ్వరం వచ్చేస్తున్నాయి. డాక్టరు కాడికి వెళ్ళమని అత్త ఎంత చెప్తున్నా వినిపించుకోవడం లేదు" అంది.

'అలాగేలే! కింద డాక్టరుగార్ని అడుగుదాం!'. అన్నాను కానీ,నాకు నెలరోజులుగా ఏవో పనులూ, పరీక్షలూ హడావిడి. వీటన్నిటితో నాకు తీరలేదు. సీతకి సమంగా పాఠం చెప్పడం కూడా కుదరలేదు. ఇంతలోనే ఒకరోజు సింహాచలం కోడలు సీత, మొగుణ్ణి రక్తం వచ్చేలా కొట్టి పుట్టింటికి పోయిందన్న వార్త మా స్కూల్లో కలకలమంది. నాకు ఏమీ అర్థంకాలేదు. సింహాచలమేమో దెబ్బతిన్న కొడుకును చూసుకోవడం కొసం పదిహేను రోజులు సెలవు పెట్టిందట.

సీత అంత తొందరపాటు ఉన్న పిల్లకాదే అని ఎంత ఆలోచించినా వివరం తెలియలేదు. ఆరోజు సాయంత్రం సింహాచలం ఇంటికి వెళ్ళాను. కొండబాబు ఎలా ఉన్నాడో చూద్దామని.

"అమ్మా! ఇశాలమ్మా!మాడమ్మా! ఎలా కొట్టిందో! దొంగముండ.తల పగిలిపోయింది. దానికేం పొయ్యేకాలమొచ్చిందో!" అంటూ లోపలికి తీసికెళ్ళింది.

కొండబాబు మంచంమీద కూర్చుని ఉన్నాడు. చాలా నీరసంగా ఉన్నాడు. కళ్ళు లోతుకుపోయాయి.తలమీద దెబ్బమాత్రం అంత పెద్దగా కనిపించలేదు. నాకేసి గాజుకళ్ళతో ఒక్కసారి చూసి తలదించుకున్నాడు.ఏమీ మాట్లాడలేదు.

'ఏం జరిగిందిరా?' అని నేనడిగినా ఏమీ మాట్లాడలేదు.

బయటకు వచ్చి మంచం మీద కూర్చున్నాను. 'రాత్రేళ మొగుణ్ణి దగ్గరకు రానివ్వడం లేదమ్మా! దొంగముండ. అన్న కూతురు కదా! నన్నూ వాణ్ణీ కడుపులో పెట్టుకుంటుందనుకున్నాను. ఎప్పుడూ కాల్చుకు తింటూనే ఉంది' అంది సింహాచలం.

"అదేమిటి సింహాచలం? సీత మంచిపిల్లే కదా! నిన్ను ఏమీ కష్టపడకుండా చూసుకుంటుంది కదా! వాడితో ఏమి గొడవో తెలుసుకోలేకపోయావా?" అన్నాను.

"నన్ను చూసుకోవడం ఎవడిక్కావాలమ్మా? పిల్లోడికి సుఖం లేకపోయేక? ఆడు చెప్పినట్టు వినుకోడం కావాల" అంది.

దాని మాటలు వింటోంటే కడుపుతీపి ఎంత బలమైనదో, గుడ్డిదో అనిపించి, చెడ్డకొడుకు ఉండొచ్చుకానీ,చెడ్డతల్లి ఉండదన్నమాట గుర్తుకు వచ్చింది. కాసేపు కూచుని, పట్టుకెళ్ళిన పళ్ళు, పచ్చడి ఇచ్చి వచ్చేశాను.

ఆలోచిస్తూ ఇంటికి వచ్చి తలుపు తీద్దామనుకుంటోంటే ఒకమూలగా అరుగుమీద, మోకాళ్ళమీద తలపెట్టుకుని ముడిచిపెట్టుకుని కూర్చుని ఉంది సీత.

'ఏం రోగమయితేలే అమ్మా! దానికి మందు లేదట. ఆ జబ్బున్నాళ్ళకి పుట్టిన పిల్లలక్కూడా వస్తాదటమ్మా! అందుకే నా బయ్యం' అంటూ ఒణికిపోతోంది సీత.



"సీతా! ఇప్పుడే మీ అత్తదగ్గరకు వెళ్ళి వస్తున్నాను. ఇలా వచ్చేవేమిటి?" అంటూ తలుపు తీశాను. నాతోపాటు లోపలికి వచ్చి నా మాటకు సమాధానంగా భోరుమని ఏడ్చేసింది.

ఏం చెప్పనమ్మా! బావ మొన్న గవర్నమెంటు ఆస్పిటల్‌కి ఎళ్ళాడమ్మా! మరీ జ్వరంగానూ, నీరసంగానూ ఉన్నాడని, వద్దంటున్నా తన వెనకాలే వెళ్ళానమ్మా! చాలా పరీచ్చలు చేసి వాడికేదో జబ్బుయిందనీ, వాడివల్ల నాక్కూడా వస్తాదనీ, దూరంగా ఉండమనీ చెప్పారమ్మా!

'ఆఁ' అని నోరు తెరుచుకుని ఉండిపోయాను. టీచరమ్మా! 'నాకింకా బతకాలనుందమ్మా! నా చిన్నముండని తల్లిలేని దాన్ని చెయ్యడం నాకిట్టంలేదమ్మా! అందుకే కొంత నయమయ్యే వరుకు దూరంగా ఉండమని బతిమిలాడినానమ్మా! ఆడు నామాట ఇనలేదు. ఇద్దరం పెనుగులాడడంతో సామాన్ల బల్లమీదున్న ఇత్తడి మరచెంబు మీద పడిపోనాదమ్మా! అత్తమ్మ ఆ మరచెంబునిండా ఇత్తడిగ్లాసులు పెట్టి మూతేసినాది. దాంతో ఆ బరువుకి బావ తలకాయమీద దెబ్బతగిలిందమ్మా! కోపంతో తాగిన మత్తులో నన్ను పట్టుకు బాదేసినాడు. మా గోలకి అత్త లేచింది. ఆడిమాట ఇని నన్ను బయటకు గెంటేసినాది. ఆరేతిరంతా మీ గుమ్మం ముందే కూకుని, తెల్లారబోయేముందు మా అమ్మ గారింటికి పోయానమ్మా!' అంటూ మళ్ళీ ఏడ్చేసింది.

'అమ్మా! నా పిల్ల ఎట్టాగుందమ్మా! ఇదిచి ఉండలేక లగెత్తి వచ్చేసినానమ్మా! అత్త రానివ్వదేమో అని బయంగా ఉన్నాది' అంటూ కూర్చుంది.

'బాగానే ఉందిలేగానీ, కొండబాబుకి ఏం జబ్బని చెప్పారు డాక్టరుగారు' అని మనసులో ఏదో సందేహం పీడిస్తోంటే భయపడుతూ అడిగాను.

'ఏం రోగమయితేలే అమ్మా! దానికి మందు లేదట. ఆ జబ్బున్నాళ్ళకి పుట్టిన పిల్లలక్కూడా వస్తాదటమ్మా! అందుకే నా బయ్యం' అంటూ ఒణికిపోతోంది.

ఏం చెప్పడానికీ నానోట మాట రాలేదు. మొగ్గలోనే చిదిమేసిన పువ్వులా కనిపిస్తోంది సీత నా కంటికి. తుఫానుగాలికి అల్లల్లాడుతున్న పండబారినఆకులా అయిపోయింది సింహాచలం బతుకు. ఆ పిల్లాడిమీనే ప్రాణాలన్నీ పెట్టుకుంది సింహాచలం. చిన్నప్పుడే మొగుడు ఏక్సిడెంట్‌లో పోతే అప్పటినుండి అతి గారాబంగా పెంచింది పాపం వాడిని.

తరువాత కొన్నిరోజులకే కొండబాబు పోయాడు. ఏమయింది? అని ఎవరైనా అడిగితే సింహాచలం కోడలు రాయిపెట్టి కొట్టి చంపేసిందని చెప్తూనే ఉంది. అలాకాదని నాలాంటిది చెప్పబోయినా మాట వినదు. నమ్మదు. వాడి చావుకి ఆ దెబ్బే కారణమంటుంది. కోడల్ని రానివ్వలేదు. పోయిన కొడుకు మీద ప్రేమతో గెంటేసింది. మనవరాల్ని కూడా ఇవ్వలేదు. ఒక్క నిముషం ఆ పిల్లను వదలకుండా కూడా తిప్పుకుంటుంది. ఆ పిల్లకు జ్వరమన్నప్పుడల్లా నా గుండెలో ఏదో భయం కలుక్కుమంటుంది.

సీత వాళ్ళమ్మ దగ్గర ఉండి ఏవో పనులు చేసుకు బతుకుతోంది. "పోన్లే అమ్మా! నా బతుకు ఎళ్ళమారడమే నాకు కట్టమమ్మా! మా అత్త నెలజీతంతో పిల్లని బాగా పెంచుద్దిలేమ్మా! నువ్వు మాత్రం రెండుముక్కలు నా పిల్లకి నేర్పు తల్లీ' అని నాకు కబురుపెట్టింది. 'టైమయిపోయింది టీచర్! రిచ్చాబ్బాయి వచ్చాడు' అంటూ సింహాచలం మనవరాలు వచ్చి పిలిచింది.

పుస్తకాలన్నీ సర్దుకుని లేచి రిక్షా దగ్గిరికి వెళ్ళబోతూంటే పరుగుపరుగున హరిత వచ్చింది.

కొండబాబు ఆలోచనలతో మొక్క సంగతి మర్చిపోయాను. మొక్కకు మందు చల్లితేగానీ హరిత నన్ను రిక్షా ఎక్కనివ్వలేదు.

** ** **

అలా వరుసగా రోజూ మందు జల్లుతూనే ఉన్నాం. కానీ నాలుగురోజులకు మొక్క పూర్తిగా ఎండిపోయింది. హరిత ముఖం చూస్తే జాలేసింది.

టీచర్! మందు వేస్తూనే ఉన్నాంకదా! ఎందుకు చచ్చిపోయింది? అంటూ నా దగ్గరికి వచ్చింది.

"లేదు హరితా! నేలలోనే ఏవో పురుగులు ఉన్నాయి. కంగారులో మనం మట్టిని శుభ్రపరచకుండా మొక్కలు నాటేశాం ఆరోజు. అలాంటప్పుడు ఈ పైపైమందుల వల్ల ఏమీ ఉపయోగం ఉండదన్నమాట.ఈసారి మనిద్దరం ముందే జాగ్రత్త తీసుకుందాం!" అని ఊరడించాను.